'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com




# కార్మికవర్గ పుత్రుడు కొప్పుల

కొప్పుల ఈశ్వర్ జీవితం గురించి తెలుసుకోవడమంటే ప్రజా ఉద్యమాల గురించి తెలుసుకోవడం. ముఖ్యంగా, భారతదేశ కార్మిక ఉద్యమ చరిత్రలో సింగరేణి కార్మిక వర్గం త్యాగాలతో నిర్మించిన విప్లవ కార్మికోద్యమం గురించి తెలుసుకోవడం.



పి.చంద్



ఈశ్వర్ జీవితం వడ్డించిన విస్తరి కాదు. భూమిని తొలచుకొని ఎదిగిన మొక్కలాగా కష్టాల కొలిమిలో రాటుదేలి జీవితాన్ని ఆయన గెలుచుకున్నారు. తరతరాలుగా సామాజిక అణచివేతలకు, వివక్షలకు గురైన మాల సామాజికవర్గం నుంచి ఆయన వచ్చారు. తండ్రి కొప్పుల లింగయ్య, తల్లి మల్లమ్మ. వారిది పేద కుటుంబం. వారికి ఏడుగురు సంతానం. ఏ పూటకు ఆ పూట పని చేస్తే తప్ప గడవని పరిస్థితి. లింగయ్య కూలీ నాలి చేసేవారు. తర్వాత కాగజ్ నగర్, మహారాష్ట్రలోని రాజోర బొగ్గు గనుల్లో కూలీ పను లు చేశారు. చివరికి సింగరేణిలో కార్మికుడిగా చేరి గోదావరిఖనిలో స్థిరపడ్డారు. ఆపదలో ఆదుకునే తండ్రి స్వభావం.. తల్లి మల్లమ్మలోని దయాగుణం ఈశ్వర్‌కు వారసత్వంగా వచ్చిన సంపద.

తాత కొప్పుల సత్తయ్య ప్రభావంతో కర్రసాము, కత్తి సాము నేర్చుకున్న ఈశ్వర్ తదనంతర కాలంలో 'అఖాడ' వంటి యుద్ధ విద్యలో మంచి నైపుణ్యం సంపాదించారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తన 14వ యేట చదువు మానేసి ఈశ్వర్ దినసరి కూలీగా పనులు చేసేవారు. చివరికి సింగరేణిలో కార్మికుడిగా జీవితాన్ని ఆరంభించారు. ఆ రోజుల్లో కార్మికుల పని పరిస్థితులు, బయట పరిస్థితులు దుర్భరంగా ఉండేవి. ఇరుకైన గుడిసెల్లోనే వాళ్ల బతుకులు తెల్లారిపోయేవి. బావుల మీద బాయి దొరల పెత్తనం సాగితే బయట గూండాల గూండాయిజం నడిచేది. ఈ అన్యాయాలను చూసి కోపంతో రగిలిపోయిన నాటి యువతరం ప్రతినిధుల్లో ఒకరైన ఈశ్వర్ క్రమంగా విప్లవ కార్మికోద్యమ నిర్మాణంలో భాగమయ్యారు. సీపీఐ (ఎంఎల్) అనుబంధంగా ఏర్పాటు చేసిన గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం వ్యవస్థాపక సభ్యుల్లో ఈశ్వర్ ఒకరు. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూనే యూనియన్ కార్యకలాపాల్లో ఈశ్వర్ మునిగిపోయేవారు. ఒకవైపు కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాడటం, మరోవైపు గూండాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసేవారు.

**పార్టీలో పనిచేస్తున్న యువకులకు పార్టీ పట్ల సానుకూల భావం కలిగి ఉన్న కుటుంబాల నుంచి పెళ్లి సంబంధాలు చూస్తే వారు మరింత సమర్థవంతంగా పనిచేస్తారని పార్టీ భావించింది. పార్టీకి అత్యంత సన్నిహితుడైన నిజామాబాద్ జిల్లా రాయకూరుకు చెందిన ఎలవర్తి సుబ్బారావు చిన్న కూతురు కోకిలతో వీరి పెళ్లి 1982 జూలై 15న పార్టీ పెద్దల ఆధ్వర్యంలో జరిగింది. ఈశ్వర్ కోరిక మేరకు ప్రముఖ విప్లవకారిని స్నేహలత పేరును కోకిల తన పేరుగా మార్చుకున్నారు. తదనంతరం దంపతులిద్దరు పార్టీలో కలిసి పనిచేశారు.**

1984లో పార్టీలో తీవ్ర విభేదాలు తలెత్తి చంద్రపుల్లారెడ్డి, పైలా వాసుదేవరావు గ్రూపులుగా పార్టీ చీలింది. అప్పటికే ఎన్టీ రామారావు తెలుగువారి ఆత్మగౌరవం కాపాడడం పేరుమీద తెలుగుదేశం పార్టీని స్థాపించి కాంగ్రెస్ పార్టీని ఓడించి ముఖ్యమంత్రి అయ్యారు. తెలుగుదేశం పార్టీలో ఈశ్వర్ చేరి, మేడారం నియోజకవర్గ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు. ఎన్టీఆర్ దృష్టిని ఆకర్షించారు. కానీ తెలుగుదేశం పార్టీలో గ్రూపు తగాదాలు ఏర్పడి ఆశించిన టికెట్ రాలేదు. 1989 ఎన్నికల్లో మరోసారి ఆశాభంగం ఎదురైంది. అయినా నిరాశ చెందకుండా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించి ఎదురులేని నాయకుడిగా ఎదిగారు. 1994 నాటి ఎన్నికల్లో మేడారం నియోజకవర్గ అభ్యర్థిగా ఈశ్వర్‌ను రామారావు ప్రకటించారు. కానీ పార్టీలోని కొందరు నాయకులు కుట్రపూరితంగా ఇండిపెండెంట్‌గా పోటీచేసిన మల్లేశంకు మద్దతు ఇచ్చారు. దీంతో ఈశ్వర్ ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అయినా ప్రజాక్షేత్రంలో ప్రజలను అంటిపెట్టుకొని పని చేశారు. 2001 సంవత్సరం నాటికి మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్నది. ఈశ్వర్ చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడే వచ్చిన తొలిదశ తెలంగాణ ఉద్యమం మనసులో బలంగా పాతుకొని ఉంది. అదే నేపథ్యంలో ఈశ్వర్‌కు మలిదశ తెలంగాణ ఉద్యమం ఆకర్షించింది. తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్ ఆహ్వానం మేరకు టీఆర్ఎస్ పార్టీలో చేరి, ఒక సైనికుడిలా ఇప్పటికీ పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులను అగ్రభాగాన నిలపడంలో ఈశ్వర్ కృషి ఎంతో ఉంది. 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ఈశ్వర్‌ను మేడారం నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించింది. ఆ ఎన్నికల్లో 56 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొంది తన చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకున్నారు. తదనంతర కాలంలో జరిగిన ఉప ఎన్నికల్లో విజయదుందుభి మోగించారు. 2009 సాధారణ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగి మేడారం నియోజకవర్గం జనరల్ సీట్‌గా మారింది. దాంతో ఈశ్వర్ ధర్మపురి నియోజకవర్గం నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. ధర్మపురి ప్రజలు ఆయనకు విజయం కట్టబెట్టారు. ఆ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చి టీఆర్ఎస్‌తో ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడంతో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. దాంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. దాంతో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని చిదంబరం ఒక ప్రకటన చేశారు. కానీ తెలంగాణ ప్రకటనను వ్యతిరేకిస్తూ ఆంధ్రా ప్రాంత సంపన్న వర్గాలు సృష్టించిన కృత్రిమ కుహనా ఉద్యమాల వలన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మరికొంత ఆలస్యమైంది. మొత్తానికి 2014 జూన్ 2న ప్రజల చిరకాల స్వప్నమైన తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ మెజార్టీ సాధించి అధికారంలోకి వచ్చింది. తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈశ్వర్ సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమించారు.

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ రెండవసారి అధికారంలోకి వచ్చింది. ధర్మపురి నుంచి నెగ్గిన ఈశ్వర్‌ను మంత్రిగా కేసీఆర్ నియమించారు. మంత్రిగా బడుగు బలహీనవర్గాలకు సేవ చేస్తూనే, మరోవైపు తన నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి కోసం అనేక పథకాలు రూపొందించి, అమలు జరిపారు. కోట్లాది నిధులు మంజూరు చేయించుకొని ధర్మపురి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో కొనసాగించారు. ఈశ్వర్ సతీమణి స్నేహలత ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా అనేక మెడికల్ క్యాంపులు నిర్వహించారు. పేద విద్యార్థులకు చదువుకునేందుకు సహాయం చేశారు. ప్రేరణ తరగతులను నిర్వహించారు. యువజనులకు శిక్షణ వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ఈశ్వర్‌కు తోడుగా నిలిచారు. ప్రజల మన్ననలు పొందారు.

ప్రజా రాజకీయ జీవితంలో గెలుపు ఓటములు సహజం. గెలిచినప్పుడు పొంగిపోకుండా, ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా నిరంతరం ప్రజాసేవలో మునిగిపోయేవాడే నిజమైన ప్రజానాయకుడు. అటువంటి ప్రజానాయకుడు ఈశ్వర్. అత్యంత సాధారణ కార్మిక కుటుంబం నుంచి అనేక కష్టనష్టాలను అనుభవించి నిరంతరం కష్టజీవుల బతుకుల్లో వెలుగు నింపాలని పరితపించిన ఈశ్వర్ జీవన ప్రయాణం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం. ఈ సందర్భంగా ఈశ్వర్‌కు 66వ పుట్టినరోజు శుభాకాంక్షలు.

**(వ్యాసకర్త: ప్రముఖ రచయిత)**

